ప్రగతి రథానికి ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు రెండు చక్రాలు

పేపర్-2, సెక్షన్-3, చాప్టర్-1

Q ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలకు మధ్య ఘర్షణ ఏర్పడితే.. ఆదేశ సూత్రాలకే ప్రాధాన్యమివ్వాలనే అభిప్రాయంతో ఏకీభవిస్తారా?

A సామాజిక జీవనాన్ని క్రమబద్ధం చేయడానికి ఏర్పరచిన రాజ్యం.. అందులోని సభ్యులైన పౌరులకు చట్టబద్ధత కలిగిన కొన్ని సౌకర్యాలను కల్పిస్తుంది. వాటినే ప్రాథమిక హక్కులని పేర్కొనవచ్చు. అయితే వీటికి సామాజిక ఆమోదం కూడా అవసరం. దాదాపు ఆధునిక రాజ్యాలన్నీ ప్రాథమిక హక్కులను ప్రస్తావిస్తాయి. వీటి ప్రధాన లక్ష్యం.. రాజ్య నిరపేక్ష అధికారం నుంచి వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించడం. దాంతోపాటు సామాన్య ప్రజానీకంపై సమాజంలోని శక్తివంతమైన వ్యవస్థలు, వ్యక్తులు తమ ఆధిపత్యాన్ని చెలాయించకుండా నిరోధించడానికి కూడా తోడ్పడతాయి. మన రాజ్యాంగకర్తలు అమెరికా, ఐరిష్ రాజ్యాంగాలను నమూనాగా తీసుకుని రాజ్యాంగంలోని మూడో భాగంలో హక్కులను పొందుపరిచారు. వీటితోపాటు నాలుగో భాగంలో ఆదేశ సూత్రాలను పొందుపరిచారు. ఐరిష్ రాజ్యాంగ ప్రభావంతో రూపొందిన ఈ సూత్రాలు సామాజిక శ్రేయస్సును ఉద్దేశించి ప్రభుత్వాన్ని నిర్దేశిస్తూ జారీ చేసిన ఆదేశాలు.

రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులు ప్రధానంగా.. సమానత్వపు హక్కు; స్వాతంత్ర్యపు హక్కు; దోపిడీ నిరోధన హక్కు; మత స్వాతంత్ర్యపు హక్కు; సాంస్కృతిక, విద్యా విషయాల హక్కు; రాజ్యాంగ పరిరక్షణ హక్కు. ఇవి వ్యక్తిగతమైనవి.. రాజకీయ స్వభావం కలిగి రాజ్యాధికారాన్ని పరిమితం చేసేవి. ఆదేశ సూత్రాలు సామ్యవాద, ఉదారవాద స్వభావాన్ని కలిగి గాంధీ ఆశయాలను ప్రతిబింబిస్తాయి. సమాన పనికి సమాన వేతనం; సంపద పంపిణీ; ప్రజలకు జీవనోపాధి; కార్మికుల సంక్షేమం, ఉమ్మడి పౌర శిక్షా స్మృతి; అంతర్జాతీయ శాంతి; కుటీర పరిశ్రమల ప్రోత్సాహం; మద్యపాన నిషేధం మొదలైనవి. రాజ్యాంగ రూపకల్పన సమయం నుంచి ప్రాథమిక హక్కులు – ఆదేశ సూత్రాల ప్రాధాన్యత విషయంలో రాజకీయ, మేధావి వర్గాల్లో విస్తృత చర్చ సాగుతోంది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభిప్రాయంలో... ఈ రెండింటి మధ్య ఘర్షణ ఏర్పడితే ఆదేశ సూత్రాలకే ప్రాధాన్యమివ్వాలి. వ్యక్తికి ప్రాధాన్యమిచ్చే ప్రాథమిక హక్కుల కంటే సామాజిక శ్రేయస్సుకు దోహదం చేసే ఆదేశ సూత్రాలు శ్రేష్ఠమైనవి. వ్యక్తిగత హక్కుల పరిరక్షణ ముసుగులో సామాజిక సంక్షేమం, ప్రగతి మరుగున పడకూడదు. తిండి, బట్ట, వసతి లాంటి కనీస ప్రాథమిక అవసరాలు లభించని వ్యక్తి సమానత్వం, వాక్ స్వాతంత్ర్యం తదితర హక్కుల గురించి ఆలోచించడు. సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమై నిరుద్యోగం, నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడే వ్యక్తి మధ్యతరగతి, సంపన్న వర్గాల ప్రాథమిక హక్కులపై ఎలా ఆసక్తి చూపుతాడు? ఈ రెండు వర్గాలు ప్రాథమిక హక్కులను ఎలా అనుభవిస్తాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి.



ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు రెండూ ఒకదానికొకటి పరిపూరకమైనవి. ఆదేశ సూత్రాలు ప్రాథమిక హక్కులకు పూర్వరంగాన్ని ఏర్పరుస్తాయి. ప్రాథమిక హక్కులు ఆదేశ సూత్రాలకు రక్షణ కల్పిస్తాయి. ఆదేశ సూత్రాలు ప్రాథమిక హక్కులకు పరిపూరకాలు

కమిషన్ వెల్లడించిన అభిప్రాయాలు పౌర సమాజ మేథోమథనానికి దారి తీసింది. సమకాలీన, భవిష్యత్ పాలనా వ్యవస్థ మీద ఈ సిఫార్సుల ప్రభావం ఎంతో ఉంటుంది.

ఈ కమిషన్ చేసిన ప్రధాన సిఫార్సులు:

ప్రాథమిక హక్కులు:

పత్రికా స్వాతంత్ర్యం, సమాచార స్వాతంత్ర్యం, గ్రామీణ ప్రజలకు ఏడాదిలో కనీసం 80 రోజుల ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, ప్రాథమిక విద్య మొదలైన వాటిని రాజ్యాంగంలో చేర్చటం. ఈ ప్రకారం.. రాజ్యాంగ సవరణ (21ఎ) ద్వారా విద్యా హక్కును చేర్చడం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా సంవత్సరానికి 100 రోజుల ఉపాధి కల్పనకు చట్ట భద్రత కల్పించడం హర్షించదగ్గ పరిణామాలు.

ఆదేశ సూత్రాలు:

ఉపాధి అవకాశాల పెంపు కోసం సమగ్ర ప్రణాళిక, ప్రతి ఐదేళ్లకోసారి జాతీయ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయడం, మత సామరస్యాన్ని పెంపొందించడం, కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశ సూత్రాలను అమలు చేస్తున్న తీరును సమీక్షించడానికి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం.. ఆదేశ సూత్రాలకు సంబంధించిన సిఫార్సులు. ఈ నేపథ్యంలో ఉపాధి అవకాశాల పెంపుదలకు కేంద్రం చొరవ తీసుకుంటోంది. అదేవిధంగా విద్యారంగంలో ప్రమాణాలు పెంచేందుకు ఇప్పటికే కొన్ని చర్యలు చేపట్టింది.

ప్రాథమిక విధులు:

ఎన్నికల్లో ఓటు వేయడం నిర్బంధం చేయడం; నిజాయతీగా పన్నులు చెల్లించడం; ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుగ్గా పాల్గొనడం. ఇప్పటికే గుజరాత్ ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో ఓటు వేయడం నిర్బంధం చేసింది.

ఎన్నికల ప్రవృత్తి:

ప్రతి ఓటరుకు గుర్తింపు కార్డు; అన్ని రాజకీయ పక్షాలకు సవరించిన ఓటర్ల లిస్టు సరఫరా; ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం; పోటీ నుంచి నేర స్థులను నిరోధించడం; ఎన్నికల ఖర్చులను ప్రభుత్వం భరించడం; మంత్రి మండలి సభ్యుల సంఖ్య దిగువ సభ సభ్యుల సంఖ్యలో పది శాతానికి పరిమితం చేయడం; ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌లతో కూడిన కమిటీ సిఫార్సుల మేరకు ఎన్నికల కమిషన్ సభ్యులను నియమించడం. వీటి ప్రకారం దేశవ్యాప్తంగా ఓటర్లందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానాన్ని అన్ని స్థాయిల్లో అమలుచేసి, ఎన్నికల్లో ప్రవేశపెట్టారు. మంత్రి మండలి సభ్యులను దిగువ సభ సభ్యుల సంఖ్యలో 15 శాతానికి పరిమితం చేస్తూ చట్టం చేశారు. ఇది అమల్లోకి వచ్చింది.

న్యాయ వ్యవస్థ:

జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. తద్వారా న్యాయ వ్యవస్థకు జవాబుదారీతనం కల్పించాలి. న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు పెంచాలి. ఈ మేరకు పార్లమెంటులో బిల్లులను ప్రవేశపెట్టారు.

కార్యనిర్వాహక వర్గం:

ఉద్యోగుల నియామకం, బదిలీ, పదోన్నతి వంటి అంశాలను స్వతంత్ర పత్రిపత్తి కలిగిన సివిల్ సర్వీస్ బోర్డుకు అప్పగించాలి. సామాజిక తనిఖీకి ప్రాధాన్యత ఇవ్వాలి. లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలు సామాజిక తనిఖీ ద్వారా పటిష్టంగా నిర్వహిస్తున్నారు.

పార్లమెంట్, రాష్ట్ర శాసన సభలు:

పార్లమెంట్, శాసన సభ సమావేశాలను మరిన్ని రోజులు నిర్వహించడం, ఎంపీ, ఎమ్మెల్యేలకు ఇచ్చే నియోజక వర్గ అభివృద్ధి గ్రాంటును రద్దు చేయడం, అంతర్జాతీయ ఒప్పందాలను పార్లమెంట్ ఆమోదించడం. దురదృష్టవశాత్తూ ఈ సూచనలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపలేదు.

కేంద్ర – రాష్ట్ర సంబంధాలు:

గవర్నర్ నియామక ప్రక్రియలో సర్కారియా కమిషన్ సిఫార్సుల అమలు. 356 ప్రకరణను తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే వినియోగించడం, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ అంశాల్లో ఏడో షెడ్యూల్‌లో చేర్చడం. గవర్నర్ నియామక ప్రక్రియలో సర్కారియా కమిషన్ సిఫార్సులను దాదాపు పాటిస్తున్నారు. ఇటీవల కాలంలో 356 ప్రకరణ దుర్వినియోగం చాలావరకు తగ్గిందని చెప్పొచ్చు.

మొత్తంమీద రాజ్యాంగ పనితీరును సమీక్షించడానికి నియమించిన కమిషన్ సిఫార్సులు ప్రస్తుత పాలనా వ్యవస్థకు స్ఫూర్తినిస్తున్నాయని చెప్పడంలో సందేహం లేదు.

Q సంకీర్ణ ప్రభుత్వ నేపథ్యంలో సమాజ వ్యవస్థలో సంభవిస్తున్న మార్పులను విశ్లేషించండి?

A స్వాతంత్ర్యం వచ్చాక మొదటి మూడున్నర దశాబ్దాల్లో కేంద్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉంది. రాష్ట్రాల్లో కూడా దాదాపు అదే పార్టీ అధికారాన్ని సొంతం చేసుకుంది. పేరుకు సమాఖ్య వ్యవస్థ అయినప్పటికీ.. ఆచరణలో ఏక కేంద్ర వ్యవస్థగా మారిందనే విమర్శ నెలకొంది. అది వాస్తవమే. ఆరో దశకం చివరి భాగంలో కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాల ఏర్పాటుతో... కేంద్ర ఆధిపత్యాన్ని ప్రశ్నించడం మొదలైంది. ప్రాంతీయ పార్టీల ప్రాభవం పెరగడం, అవి కేంద్ర ప్రభుత్వ పెత్తందారీతనాన్నీ సవాలు చేయడం కూడా ప్రారంభమైంది. రాజమన్నార్ కమిటీ సిఫార్సులు కేంద్ర – రాష్ట్రాల మధ్య కొనసాగు

తున్న అంతరాలను తొలగించడానికి ఉద్దేశించాయి. మొదటిసారి 1977లో కేంద్ర స్థాయిలో సంక్షేమ ప్రభుత్వం (జనతా ప్రభుత్వం) ఏర్పాటైంది. ఎక్కువ కాలంలో అధికారంలో లేకున్నా దాని ప్రభావం ప్రస్తుత రాజకీయాలపై స్పష్టంగానే కనిపిస్తోంది. జాతీయ పార్టీలు బలహీనపడటం, ప్రాంతీయ పార్టీలు బలోపేతం కావడానికి నాంది పలికింది. ఇవి కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యాన్ని అడుగడుగునా ప్రశ్నించడం మొదలుపెట్టాయి. 9వ దశకం నుంచి కేంద్ర స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వాలు కొనసాగుతున్నాయి. ఎనిమిదో దశకంలో నియమించిన సర్కారియా కమిషన్, 2007లో నియమించిన పూంచి కమిషన్.. మారిన పరిస్థితుల్లో కేంద్ర రాష్ట్ర సంబంధాల పునఃపరిశీలనకు ఉద్దేశించినవి. మరోవైపు మారిన పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం పట్టువిడుపు ధోరణితో వ్యవహరిస్తూ సహకార సమాఖ్య దిశగా పయనిస్తోందని చెప్పొచ్చు. ప్రాంతీయ పార్టీల నాయకులు, రాష్ట్ర ముఖ్యమంత్రులుగా కొనసాగుతూ.. కేంద్ర ప్రభుత్వానికి పరిమితులతో కూడిన మద్దతిస్తూ కేంద్రాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నారు. తొమ్మిదో దశకంలో చంద్రబాబు నాయుడు, ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత.. ప్రస్తుతం కరుణానిధి, నితీశ్ కుమార్, నవీన్ పట్నాయక్ వంటి ముఖ్యమంత్రుల ప్రభావం దేశ రాజకీయాలపై ఏమేరకు ఉందో మనకు తెలిసిందే. అనేక సందర్భాల్లో విదేశాంగ విధానాన్ని (ఉదా: శ్రీలంక విషయంలో భారతదేశ విదేశాంగ విధానాన్ని తమిళనాడు రాజకీయాలు ప్రభావితం చేశాయి), రక్షణ విధానాన్ని సంకీర్ణ రాజకీయాలు నిర్దేశిస్తున్నాయనేది వాస్తవం. ప్రాంతీయ పార్టీల ముఖ్యులు కేంద్ర ప్రభుత్వంలో కీలక మంత్రిత్వ శాఖలు పొంది తమ రాష్ట్రాలకు మరిన్ని రాయితీలివ్వడం పరిపాటైంది. కేంద్ర ప్రభుత్వం వెనుకటి మాదిరిగా రాష్ట్రాల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించలేకపోతోంది.

సంకీర్ణ ప్రభుత్వాల వల్ల రాజకీయ అస్థిరత, నిర్ణయ ప్రక్రియలో జాప్యం, అమలులో అనిశ్చితి తదితర ఇబ్బందులు తలెత్తినప్పటికీ... అర్థసమాఖ్య వ్యవస్థ క్రమేణా సమాఖ్య వ్యవస్థవైపు పయనించడానికి, కేంద్ర రాష్ట్రాల మధ్య సమతౌల్యత సాధించడానికి సంకీర్ణ ప్రభుత్వాలు, రాజకీయాలు దోహదం చేస్తాయని చెప్పొచ్చు.